ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
ఆదివారం 21 సెప్టెంబరు 2025



మాట్లాడుతున్న దిశ చైర్మన్, ఎంపీ అవినాశ్ రెడ్డి... చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

జిల్లా అభివృద్ధికి కృషి

- దిశ చైర్మన్, ఎంపీ అవినాశ్‌రెడ్డి
- ఉల్లి, యూరియా సమస్యలు అధిగమిస్తున్నాం : కలెక్టర్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు పేదలకు సక్రమంగా అందించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) చైర్మన్ వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో దిశ సెక్రటరీ, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజంపేట, బద్వేలు ఎమ్మెల్యేలు అమర్‌నాథరెడ్డి, దాసరి సుధ, నగర మేయర్ సురేశ్‌బాబు, జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి హాజరయ్యారు. ముందుగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను మానిటరింగ్ చేయడం కోసం ఈ దిశ కమిటీ ఏర్పాటు అయిందన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రావాల్సిన నిధులు ఏవిధంగా తీసుకురావాలి అనేది ఈ కమిటీ ద్వారా చర్చిస్తామన్నారు. ఉల్లి పంట మార్కెటింగ్‌లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 13 వేల ఎకరాల్లో ఉల్లి సాగులో ఉందన్నారు. మనజిల్లాలో పండే ఉల్లి విదేశాలకు ఎగుమతులు అవుతాయన్నారు. మనం ఉపయోగించే ఉల్లి దిగుమతి చేసుకుంటామన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉల్లి ఎగుమతులకు అడ్డంకులు రావడంతో, ప్రస్తుత ప్రతికూల పరిస్థితులను అధిగమించే చర్యలు చేపడుతున్నామన్నారు.

ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అక్రమాలకు పాల్పడినా, తప్పుడు బిల్లులు, మస్టర్ రికార్డులు నమోదు చేసినా చర్యలు తీసుకోవడంపై ఎంపీ అభ్యంతరం వ్యక్తం చేశారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీకి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఉద్యాన పంటలకు అవసరమైన మైక్రో ఇరిగేషన్ పరికరాలను అందిస్తామన్నారు. హార్టికల్చర్‌లో 60 వేల హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డ్రిప్ లో ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీ, ఇతరులకు 90శాతం రాయితీ ఇస్తామన్నారు. జిల్లాలో ఈ సీజన్‌కు యూరియా కొరత లేదన్నారు.

గండికోట, రాజోలి సమస్యలు పట్టించుకోండి



- అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆది

కొండాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు, రాజోలి ఆనకట్ట సమస్యలను పట్టించుకోవాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడారు. కుప్పానికి కూడా నీరందించే ప్రాజెక్టు గండికోట అన్నారు. ఎవరైనా పరిహారం ఇచ్చి నీళ్లు నింపుతారు కానీ, మాజీ సీఎం జగన్ నాలుగేళ్ల కిందట గండికోట నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా ప్రాజెక్టులో నీళ్లు నింపారన్నారు. అతర్వాత ఈ బిడ్డను క్షమించండి అన్న మాటతో సరిపెట్టుకొని, రూ.450 కోట్ల మేర పరిహారం ఇవ్వకుండా నిర్వాసితుల గొంతు కోశారని జగన్‌పై మండిపడ్డారు. గాలేరు-నగరి పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు ఉపయోగపడే రాజోలి ఆనకట్ట పూర్తిచేయాలని కోరారు. రాజోలి ఆనకట్ట నిర్మాణం జరగక పోవడం వల్ల కుందూ నదికి వరదలు వచ్చినప్పుడు పంటలు ముంపునకు గురవుతున్నాయన్నారు. జిల్లాలో 400చెరువులు ఉన్నాయని వాటిలో 170చెరువులు నింపారని, ఇంకా 228 చెరువులు నింపడానికి సుమారు రూ.50కోట్లు అవసరమని, వాటికి నిధులు విడుదల చేయాలని కోరారు.

వరప్రదాయిని.. వాసవీమాత

- ప్రొద్దుటూరుకు తలమానికంగా అమ్మవారిశాల
- దసరా నిర్వహణలో రెండవ మైసూరుగా ప్రసిద్ధి
- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం



ప్రొద్దుటూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం

వజ్రపుచీర కిరీట ధారణలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి

ఆలయ నిర్మాణానికి కృషి చేసిన కామిశెట్టి చిన్నకొండయ్య

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోర్కెలు తీర్చే వరప్రదాయినిగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారు విరాజిల్లుతున్నారు. ప్రొద్దుటూరులో అమ్మవారిశాల ఆలయాన్ని 1890లో మెయిన్‌బజార్‌లో నిర్మించారు. ఈ ఆలయం చక్కని శిల్పకళా నైపుణ్యంతో తీర్చిదిద్దారు. 1895 నుంచి ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఆలయంలో దసరా ఉత్సవాలను శోభాయమానంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు జరిగే 9 రోజులు పట్టణం పండుగ శోభను సంతరించుకుంటుంది. ఇక్కడ దసరా ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తుండడంతో ప్రొద్దుటూరు పట్టణం రెండవ మైసూరుగా ప్రసిద్ధి పొందింది. 22వ తేదీ సోమవారం నుంచి ఆలయంలో ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఆర్యవైశ్య సభ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహాత్మాగాంధీ సందర్శించిన ఆలయం

అమ్మవారిశాలను జాతిపిత మహాత్మాగాంధీ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాతంత్ర్య ఉద్యమం కోసం ఆర్యవైశ్య సభ నిర్వాహకులు గాంధీజీకి సేరు బంగారం విరాళంగా ఇచ్చినట్లు పేర్కొంటారు. కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి, జయేంద్ర సరస్వతి ఆలయంలో విడిది చేసి లోక కల్యాణార్థం 40 రోజులపాటు యజ్ఞ యాగాదులు నిర్వహించారు. ఎందరో జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఆర్యవైశ్యులు బంగారు ఆభరణాలు, బంగారు చీరె, వజ్రపు చీరె, కిరీటం సమకూర్చారు. గర్భగుడి, వాకిళ్లకు వెండి తొడుగులు అమర్చారు. అమ్మవారి సేవకోసం వెండి ఊయల, అద్దాల మండపం, బంగారు రథం చేయించారు.

ఆలయ చరిత్ర

అమ్మవారిశాల ఆలయం నిర్మాణంలో ఎందరో మహనీయుల కృషి ఉంది. రాజుపాళెం మండలం పర్లపాడుకు చెందిన వ్యాపారవేత్త కామిశెట్టి చిన్నకొండయ్యకు అమ్మవారు కలలో సాక్షాత్కరించి పెనుగొండవాసినైన తాను పినాకిని (పెన్నా) నది ఒడ్డున ఉత్తర దిక్కున ఉన్న ప్రొద్దుటూరు పట్టణంలో కొలువుదీరనున్నానని తనకు ఒక ఆలయం నిర్మించాలని ఆదేశించింది. ఈ విషయాన్ని ఆ వ్యాపారి పట్టణానికి చెందిన కొందరు ఆర్యవైశ్యులకు వివరించారు. దీంతో ఆర్యవైశ్యులందరు కలిసి దివ్యమైన ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆ కాలంలోనే ఆలయ నిర్మాణానికి సుమారు రూ.లక్ష ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆలయంపై ఉన్న గాలిగోపురం పట్టణానికి తలమానికంగా నిలుస్తోంది. ప్రొద్దుటూరు అనగానే గుర్తుకు వచ్చేది అమ్మవారి గాలిగోపురం. ఆలయం నిర్మించినప్పటి నుంచి దసరా ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. 1895 నుంచి ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిశాలలో ప్రతిరోజు విశేష పూజలు, అర్చనలు నిర్వహించడమే కాక లోక కల్యాణార్థం వేద పండితులు వాసవీ మాత నిత్యహోమం నిర్వహిస్తుంటారు.

ఆకట్టుకునే అలంకారాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి నిర్వహించే అలంకారాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో అమ్మవారిని శోభాయమానంగా అలంకరిస్తారు. దసరా చివరిరోజున విజయదశమిని పురస్కరించుకుని నిర్వహించే అమ్మవారి గ్రామోత్సవం, అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యే తొట్టి మెరువణి భక్తులను పరవశింపజేస్తుంది. తొట్టిమెరువణిని తిలకించడానికి ఇతర జిల్లాలతోపాటు దూర ప్రాంతాలకు చెందిన భక్తులు వస్తారు. భక్తుల కోలాహలంతో ఆ రోజు ప్రొద్దుటూరు జనసంద్రంగా మారుతుంది.

ఫైనాన్స్ వ్యాపారి కిడ్నాప్

- కారులో తీసుకెళ్లిన దుండగులు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



కిడ్నాపైన వేణుగోపాల్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డిని శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. బొల్లవరంలోని మున్సిపల్ లేఅవుట్‌లో నివాసముంటున్న వేణుగోపాల్‌రెడ్డి పట్టణంలో చాలామందికి వడ్డీలకు అప్పులు ఇచ్చాడు. అప్పులు వసూళ్లు చేసుకోవడంలో భాగంగా శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటినుంచి స్కూటీలో బయలుదేరి వెళ్లాడు. రాత్రి 8 గంటలు అవుతున్నా ఇంటికి రాకపోవడంతో ఇంట్లో వారికి అనుమానం వచ్చి వాచ్‌మన్‌ను రోడ్డుమీదకు వెళ్లి చూడమని చెప్పారు. అతను జమ్మలమడుగు రోడ్డులోని మున్సిపల్ లేఅవుట్ ఆర్చి వద్దకు రాగా అక్కడ వేణుగోపాల్‌రెడ్డి స్కూటీ, చెప్పులు కనపడ్డాయి. పక్కనే కారంపొడి పడి ఉంది. వాచ్‌మన్ ఈ విషయం వేణుగోపాల్‌రెడ్డి భార్య ప్రమీలాదేవికి తెలిపాడు. దీంతో ఆమె ప్రొద్దుటూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అరుణ్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్కడి పరిసరాల్లో సీసీ కెమెరాలను పరిశీలించగా వేణుగోపాల్‌రెడ్డిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రత్యేక టీంలను వేసి గాలింపు చర్యలు చేపట్టారు. కాగా.. వేణుగోపాల్‌రెడ్డి వద్ద అప్పులు తీసుకున్నవారు డబ్బులు ఇవ్వకపోవడంతో వారిపై కోర్టులో కేసులు వేసినట్లు భార్య ప్రమీలాదేవి తెలిపారు. ఈ కేసులు హియరింగ్‌కు రావడంతో వారే కిడ్నాప్ చేసి ఉంటారని ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు.

ఆరోగ్య జిల్లా అందరి బాధ్యత





మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప కలెక్టరేట్/కడప క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో అధికారులతో కలసి కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హరిత కడప సాధన కోసం కడప నగరంతో పాటు అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీపీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.
స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు స్టేడియం ఆవరణలో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.



పెద్దముడియం: వర్షంతో కోతకు గురైన మేడిదిన్నె-గుండ్లకుంట మధ్య రహదారి



పెద్దముడియం: దెబ్బతిన్న చిన్నపసుపుల-ఉప్పలపాడు గ్రామాల మధ్య రోడ్డు



రాజుపాళెంలో నీట మునిగిన వరి పంట

జమ్మలమడుగులోని దేవగుడి సుగుమంచిపల్లె ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



కుంభవృష్టి

- జమ్మలమడుగు డివిజన్‌లో భారీ వర్షం
- నీట మునిగిన పంట పొలాలు, రోడ్లు
- పొంగి ప్రవహిస్తున్న కల్వర్టులు
- తెగిపోయిన రోడ్లు

ప్రొద్దుటూరు/జమ్మలమడుగు/ఎర్రగుంట్ల/రాజుపాళెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డివిజన్‌లో శుక్రవారం రాత్రి కుండపోత వాన కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమై తెల్లవారుజాము వరకు దంచి కొట్టింది. దీంతో జమ్మలమడుగు పట్టణంలో లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రోడ్లు జలమయం అయ్యాయి. ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో వర్షపునీటితో చెరువును తలపించింది. పీఆర్ హైస్కూలు మైదానంలో, మార్కెట్ హైస్కూలు ఆవరణలో వర్షపు నీరు నిలిచింది. దానవులపాడు, చలివెందుల, దేవగుడి రోడ్లకు ఇరువైపుల పంట పొలాలన్నీ నీటమునిగాయి. కల్వర్టులు పొంగి ప్రవహిస్తున్నాయి. పెద్దముడియం మండలంలో వర్షంధాటికి పొలాలన్నీ చెరువులను తలపించాయి. ఎక్కడికక్కడ వంకలు వాగులు పొంగిపొర్లాయి. గుండ్లకుంట, మేడిదిన్నె గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురైంది. అలాగే చిన్నపసుపుల, ఉప్పలపాడు గ్రామాల మధ్య రోడ్డు గండి పడింది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. తహశీల్దారు బాలనరసింహులు గ్రామాల్లో పరిస్థితి సమీక్షించారు. జమ్మలమడుగు, పెద్దముడియం మండలాల్లో శుక్రవారం రాత్రి 13 సెం.మీ వర్షం కురవడంతో మడమ వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో వంకకు ఆనుకుని ఉన్న రాజుపాళెం మండలం పర్లపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీ పూర్తిగా నీటమునిగింది. వందేళ్లలో ఎప్పుడూ ఇంత వర్షం చూడలేదని కాలనీ వాసులు తెలిపారు. శనివారం ఉదయం తహశీల్దారు మనోహర్‌రెడ్డి తన సిబ్బంది సాయంతో కాలనీవాసులను ఎగువ ప్రాంతాలకు తరలించారు. మధ్యాహ్నం ఆర్డీవో సాయిశ్రీ ఎస్సీకాలనీలో పర్యటించారు. అర్కటవేముల, అయ్యవారిపల్లె, టంగుటూరు, తొండలదిన్నె పొలాలు పూర్తిగా నీట మునిగాయి. ఎర్రగుంట్లలో శుక్రవారం రాత్రి 84 మి.మీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. నిడుజువ్వి వద్ద వంక ఉధృతంగా ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలు ఆగిపోయాయి. ఎర్రగుంట్ల మున్సిపాలిటీలోని వీధుల్లో భారీగా నీరు చేరింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శేషఫణి కోరారు. ప్రొద్దుటూరు పట్టణంతో పాటు చుట్టూ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పొద్దుటూరు పెన్నా నదితోపాటు వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. పెన్నానదిపై కాజ్‌వే తెగిపోయి ఆర్టీపీపీ రాకపోకలు బంద్ అయ్యాయి. కొట్టుకుపోయిన కాజ్‌వేను తహశీల్దారు గంగయ్య ఆర్ఐ నాగమోహన్ రెడ్డి పరిశీలించారు.



జమ్మలమడుగు మార్కెట్ హైస్కూలు మైదానంలో నిలిచిన వర్షపునీరు



రాజుపాళెం మండలం పర్లపాడు ఎస్సీ కాలనీలో నడుములోతు నీళ్లలో దిగి సహాయక చర్యలు చేపట్టిన తహశీల్దారు



ప్రొద్దుటూరులో పెన్నానదిపై తెగిన కాజ్‌వేను పరిశీలిస్తున్న తహశీల్దారు



ఎర్రగుంట్ల మండలం నిడుజువ్వి వద్ద వంక ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆగిన రాకపోకలు

ఆ శాఖలో అధికారులే కరువు..!

- ఏడాదికాలంగా కనిపించని డీఆర్
- ఇది స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ తీరు

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్నతాధికారులు కనుచూపు మేరా కనిపించడం లేదు. దాదాపు ఏడాది కాలంగా అన్నమయ్య జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇన్‌చార్జిలతోనే కొనసాగుతోంది. జిల్లాలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏదైనా ఇబ్బంది అనిపిస్తే వారు డిస్ట్రిక్ కార్యాలయానికి వచ్చి డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌తో చర్చించాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఇక్కడికి డీఆర్‌గా చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న డీఆర్‌కు ఇన్‌చార్జ్‌గా ఇచ్చారు. అయితే రాయచోటిలో కనిపించిన దాఖలాలే లేవు. డీఆర్ అందుబాటులో లేకపోవడం వల్ల జనరల్ పవర్ పట్టా ఉన్న ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండెక్స్ పీడీ కొట్టడంలో కూడా ఏదైనా పొరపాటు జరిగితే దానికి సమాధానం చెప్పే నాథుడు లేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్ని రిజిస్ట్రేషన్లు జరగకుండా ఆగిపోయిన సందర్భాలు కూడా చాలా ఉన్నాయి. ఇంత పెద్ద జిల్లాకు జిల్లా రిజిస్ట్రార్లు భర్తీ చేయకపోవడంపై చాలా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ ఆ కార్యాలయంలో సిబ్బంది కనుచూపుమేరా కనిపించడం లేదు. ఇప్పటికైనా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ వారు అన్నమయ్య జిల్లా డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌ను నియమిస్తే బాగుంటుందని ఇక్కడ ప్రజలు కోరుకుంటున్నారు.



డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, రాయచోటి

రెండు వారాలుగా ఆ సీటు ఖాళీ

రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దాదాపు రెండు వారాల క్రితం ఇక్కడున్న సబ్ రిజిస్ట్రార్ కడపకు బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆ సీటు ఖాళీగా ఉంది. ఆ స్థానానికి సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి ఇచ్చి కాలం నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామాల్లో ఉన్నటువంటి గ్రామ కంఠాలన్నీ కూడా రిజిస్ట్రేషన్లకు చేసి అందిన కాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఇంత జరుగుతున్నా రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న పెద్దలు ఏం చేస్తున్నారు, అసలు అన్నమయ్య జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ విధులు సక్రమంగా నిర్వహిస్తుందా లేదా అన్న సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఈ కార్యాలయంపై దృష్టి పెట్టి సీటు భర్తీ చేయాల్సిన అవరం ఎంతైనా ఉందని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.

జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వివరణ

ఈ విషయంపై డీఆర్ వెంకట్రమణ మూర్తిని వివరణ కోరగా... వారు ఇలా అన్నారు. నేను అక్కడికి రాలేను, ఈ రోజు నాకు కుప్పంలో క్యాంపు ఉంది. కాబట్టి నేను రాలేకపోతున్నాను అని అన్నారు.

నాడు-నేడు.. అసంపూర్తిగానే...

- ఆగిపోయిన పాఠశాల పక్కా భవనాలు
- రూ.3 కోట్ల నిధులు... పనులు అరకొరే...

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద 29 పాఠశాలల పక్కా భవనాలు 3 కోట్ల రూపాయలతో మంజూరయ్యాయి. అయితే వచ్చిన నిధులు వాడేసినా భవనాలు మాత్రం అసంతృప్తిగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా అసంతృప్తి భవనాలు పూర్తయ్యేనా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. 2022 సంవత్సరంలో మండలంలో 26 పాఠశాల భవనాలు, మూడు అంగన్వాడీ పక్కా భవనాలు మంజూరయ్యాయి. అయితే 29 పక్కా భవనాల్లో ఒక్క పాఠశాల కూడా పూర్తి కాలేదు. ఒక్కొక్క పాఠశాలకు 15 నుంచి 20 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. 2019 నాటికి పాఠశాల పక్కా భవనాలు కేవలం గోడలు, స్లాపు, పూతల వరకు పూర్తయి ఆగిపోయాయి. అప్పటి నుంచి ఇంతవరకు పట్టించుకోవడం లేదు. 3 కోట్ల రూపాయల్లో 2.90 కోట్లు నిధులు అయిపోయాయి. ఇంకా పనులు మాత్రం ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉన్నాయి. పందిళ్లపల్లె, కస్తూరిరాజుగారిపల్లె, లక్కిరెడ్డిపల్లె, కేజీబీవీ, దిన్నెపాడు, దేవళంపల్లి, కోనంపేట, దప్పేపల్లె గ్రామాల్లోని పాఠశాలల పక్కా భవనాలు కేవలం స్లాబు, పూతల వరకు వచ్చి ఆగిపోయాయి. ఆయా గ్రామాల్లో విద్యార్థులు పాత పాఠశాలలోనే విద్యను అభ్యసిస్తున్నారు. నాడు- నేడు రెండవ విడతలో మంజూరైన భవనాలు మాత్రం ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఉన్న నిధులు పూర్తయ్యాయి. భవనాలు మాత్రం అలాగే అసంతృప్తిగా దర్శనమిస్తున్నాయి. పందిళ్లపల్లె యూపీ స్కూల్‌లో పక్కా భవనం మంజూరైంది గానీ కేవలం స్లాబ్ వరకు వచ్చి పనులు ఆగిపోయాయి. ఆ పాఠశాల విద్యార్థులు చెట్ల కింద విద్యను అభ్యసిస్తున్నారు. దిన్నెపాడు పాఠశాలలో కడ్డీలు ఇంతవరకు అమర్చకుండా పాఠశాలలోనే తుప్పు పట్టిపోతున్నాయి. గొల్లపల్లి పాఠశాలలో కేవలం స్లాబ్ వేసి వదిలేశారు. విద్యార్థులు పాత భవనాల్లోనే విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల భవనాలు అసంతృప్తిగా ఉండడంతో చెట్ల కింద, బయట కూర్చుని విద్యను అభ్యసిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైన ఆగిపోయిన పాఠశాల పక్కా భవనాలను పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆగిపోయిన పక్కా భవనాల కోసం ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అసంతృప్తిగా ఉన్న పాఠశాల పక్కా భవనాలు పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



స్లాబ్ వరకు వచ్చి ఆగిపోయిన పందిళ్లపల్లె యూపీ పాఠశాల పక్కా భవనం



అసంపూర్తిగా ఉన్న గొల్లపల్లె ప్రాథమిక పాఠశాల

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ముగ్గురి ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

రాజంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న సౌత్ జోన్ మహిళా కబడ్డీ జట్టులో రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ విద్యార్థులు స్థానం సంపాదించారు. ఈ నెల 27 నుంచి 31 వరకు కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు విశ్వవిద్యాలయంలో సౌత్‌జోన్ మహిళా కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధిదదంచిన జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపికలో అత్యంత ప్రతిభ కనబరచిన కె.అఖిలసాయి, కె.భవిత, ఎం.నిఖిత మరో ముగ్గురు విద్యార్థినులకు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ సాయిబాబారెడ్డి, యూనివర్సిటీ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, బి.నాగముని, జయరామిరెడ్డిలు మెమెంటోలు అందజేసి అభినందించారు.

కోడిపందాల స్థావరాలపై దాడి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలం పెద్దపల్లె గ్రామ పంచాయతీ మిట్టపల్లె సమీపంలోని రైల్వేబ్రిడ్జి సమీపంలోని కోడిపందేల స్థావరాలపై దాడిచేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అరెస్ట్ అయిన వారినుంచి రూ.10,500 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మండలంలో మట్కా, జూదం, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పప్పు దినుసుల మోడల్ ప్రయోజనకరం



కందిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు

రామాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండావాండ్లపల్లె సమీపంలో పప్పు దినుసుల మోడల్‌ని డీఏవో శివనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి మోడల్స్ రైతులకు లాభదాయకమని ఖర్చులు తగ్గి ఆదాయం వస్తుందని, తక్కువ వర్షపాతంలోనూ దిగుబడులు వస్తాయని తెలియజేశారు. ఈ మోడల్‌లో కందితో పాటు అనుములు, అలసందలు, ఉద్దులు, పెసర్లు, ఆముదం, గోరుచిక్కుడుతో పాటు బార్డర్ క్రాప్ వేశారని ఇలా వేసుకుంటే ఒక పంట పోయినా ఇంకొక పంటలో ఆదాయం వస్తుందని తెలిపారు. ఏవో నాగమణి మాట్లాడుతూ ఇలాంటి మోడల్స్ ఆదర్శంగా ఉండాలని తక్కువ ఖర్చుతో పండించుకోవచ్చునని తెలిపారు. రామాపురం మండలం ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ మాట్లాడుతూ ఈ ప్లాట్‌లో ఆరు రకాల పప్పు దినుసులు వేశారని బార్డర్ క్రాప్స్‌గ ఎరపంటలు వేశామని, ఇలా ప్రతి రైతు వేసుకోవాలని తెలిపారు. మామిడి తోట ఉన్న ప్రతి రైతు కూడా నవధాన్యాలు సాగు చేయాలని, అలా చేస్తే మామిడిలో దిగుబడి పెరగడమే కాకుండా పొలంలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు వెంకట్రామిరెడ్డి, సుధాకర్, చిట్లూరు క్యాడర్ వీఏఏ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిప్పిలి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మర్మతు పనులు శనివారం జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో కార్తీకమాసం ప్రారంభమవుతోందని, అయ్యప్ప మాలదారులు అధికంగా ఆలయానికి వస్తారని వారికి సౌకర్యం కల్పించడానికి ఆలయంలో మర్మతు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయాన్ని శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో గ్రాప్ టెంపుల్ ఈఓ రమణ, దేవాదాయశాఖ సిబ్బంది అంకన్న, రాజశేఖర్, బీజేపీ జర్మనీరాజు, తదిరతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచండి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని, ప్రజలందరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం సంబేపల్లెలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మూడో శనివారం రోజు గ్రీన్ ఆంధ్రప్రదేశ్ అనే ఇతివృత్తంతో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని పాశ్చాత్య దేశాలు మన సంస్కృతి నుంచి పరిశుభ్రతను నేర్చుకొని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఇంట్లో అవసరాలకు ప్లాస్టిక్ కవర్లు కాకుండా క్లాత్ కవర్లను వినియోగించాలని సూచించారు.

సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమం చివరిగా మానవహారంగా ఏర్పాటు చేసి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయ శాఖాధికారి లక్ష్మీపతి, జిల్లా పంచాయతీశాఖ అధికారి రాధమ్మ, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. శనివారం మదనపల్లె టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో డీఎస్పీ నిందితుల వివరాలను వెల్లడించారు. తనకల్లు మండలం టి. సదుం గ్రామం, నందివారిపల్లె వాసి రామన్న, భార్య రమణమ్మ, భార్య తమ్ముడు బి.కొత్తకోట మండలం, బావగారిపల్లె వాసి ఈశ్వర్ కలిసి మదనపల్లె పట్టణం, రామారావు కాలనీలో ఇల్లు బాడుగకు తీసుకుని నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవించేవారు. బావ రామన్న రోజూ మద్యం సేవిస్తూ కూలి పనులకు వెళ్లకుండా, అక్కను కొట్టి వేధింపులకు గురిచేస్తుండగా, వేధింపులు, అప్పుల బాధ భరించలేక తమ్ముడు ఈశ్వర్‌తో కలిసి భార్య రమ్మణమ్మ ఈ ఏడాది మార్చి 12వ తేదీ మధ్యాహ్నం రమణమ్మ ఆమె తమ్ముడు ఈశ్వర్ రుబ్బురోలు రాయితో రామన్న తలపై మోది హత్య చేశారు.

స్కూల్‌కు వెళ్లిన పిల్లలను ఇంటికి రావద్దని, బంధువుల ఇంటికి పంపి, అదేరోజు రాత్రి మృతదేహాన్ని గోనె సంచిలో వేసుకుని తమ స్కూటీపై తీసుకెళ్లి మదనపల్లెకు 45 కిలో మీటర్ల దూరంలో బి.కొత్తకోట, కస్తూర్బా పాఠశాల సమీపంలో హంద్రీనీవా కాలువ గట్టున పాతిపెట్టారు. మృతుడి అన్న లక్ష్మన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో అదృశ్యం కేసు నమోదు చేశారు. మృతుడి అన్న నిందితులు ఇద్దరిపై అనుమానం వ్యక్తం చేయడంతో శుక్రవారం మధ్యాహ్నం స్థానిక రామారావు కాలనీలో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు వాస్తవాలు తెలిపారని, ఈ మేరకు బి.కొత్తకోట సమీపంలో మృతదేహాన్ని పూడ్చిపెట్టిన స్థలం వద్దకు కొత్తకోట తహసీల్దార్, మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ రహింతుల్లా నిందితులతో కలిసి వెళ్లి అక్కడ రామన్న మృతదేహం పూడ్చిన గోనె సంచిని తవ్వి పైకి తీసి రీపోస్టుమార్టం నిర్వహించారు. అక్కడ ఎముకలు మాత్రమే లభించాయి. అవి ల్యాబ్‌కు పంపి నిందితులపై హత్య కేసు నమోదు చేశామని డీఎస్పీ పేర్కొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

దళితుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రతి నెలా సివిల్ రైట్స్ డే నిర్వహిస్తోందని కేవీపల్లె తహసీల్దారు నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. కేవీపల్లె మండలం నూతనకాల్వ పంచాయతీ దొర్నాలపల్లెలో శనివారం నేషనల్ సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా దొర్నాలపల్లె మాదిగపల్లెలో వెలుగు సంఘమిత్రగా పనిచేసిన వ్యక్తి సభ్యులు నిధులు గోల్‌మాల్ చేశాడని ఏపీ ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ ముల్లంగి చంద్రయ్య ఫిర్యాదు చేయగా వెంటనే అతన్ని తొలగించి వేరే వారిని నియమిస్తామని ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. వీధి లైట్లు సరిగ్గా వెలగడం లేదని, తమకు ఉపాధి ద్వారా పనులు కల్పించాలని, తమ ఇళ్లు ఉరుస్తున్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేయడంతో సంబంధిత శాఖల సిబ్బందిని ఆయా పనులు చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. నూతన కాల్వలోని ఓ హోటల్ నిర్వాహకులు కులవివక్ష పాటిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా అధికారులు హోటల్ నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించడమే కాకుండా భవిష్యత్తుల్లో కులవివక్ష పాటిస్తే హోటల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నరెడ్డప్ప, ఏపీఓ నాగరాజు, ఏపీఎం అనూరాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిబాబు, ఏపీ ఎంఆర్‌పీఎస్ నేతలు శ్రీనివాసులు, నాగేశ్వరయ్య, అశోక్ సామ్రాట్, ఆంజనేయులు పాల్గొన్నారు.



సివిల్ రైట్స్ డేలో అధికారులు, ప్రజాసంఘాల నేతలు

అనుమతి లేకుండా కలప రవాణా

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా పచ్చని చెట్లు కూల్చాలన్నా, రవాణా చేయాలన్నా అటవీశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి, కాని మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో ఎప్పుడో కూల్చేసిన మూడు చెట్లను ఇప్పుడు కొందరు అనుమతి లేకుండా పట్టపగలే రవాణా చేయడం చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఆరునెలల కిందట మూడు చెట్లు నేలకూలాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వాస్పత్రి వర్గాలు వీటిని బహిరంగ వేలం వేసి కలపను విక్రయించాలి. కలప కొనుగోలు చేసిన వ్యక్తి అటవీశాఖ అనుమతి తీసుకుని రవాణా చేయాలి. కానీ ఇవేమీ జరగకనే శనివారం చెట్ల మొదళ్లను ముక్కలు చేసి కలపను ట్రాక్టర్లలో ఎత్తి రవాణా చేసేశారు. ఈ విషయమై మదనపల్లె ఎఫ్ఆర్ఓ ప్రసాదరావును వివరణ కోరగా, ప్రభుత్వాస్పత్రిలో కలప రవాణాను అనుమతి ఇవ్వలేదని, దీనిపై విచారించి అక్రమ రవాణా చేసివుంటే అటువంటి వ్యక్తులకు జరిమానా విధిస్తామన్నారు.



ట్రాక్టర్‌లోకి కలపను లోడ్ చేస్తున్న కూలీలు

ప్రిన్సిపాల్‌పై డీఈవో విచారణ



ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈవో సుబ్రహ్మణ్యం

కలకడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలకడ ఆదర్శ పాఠశాల గత ప్రిన్సిపాల్, ప్రస్తుత ప్రిన్సిపాల్ మలాంషావలిపై శనివారం డీఈఓ సుబ్రహ్మణ్యం విచారణ చేపట్టారు. పాఠశాల పునఃప్రారంభమైన జూన్‌లో ఇక్కడ విధుల్లో ఉన్న మలాంషావలి పురుగులు పట్టిన బియ్యంతో అన్నం చేయించారని అప్పట్లో పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు డీఈఓకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై జూన్ 20వ తేదీన మదనపల్లె డీవైఈఓ లోకేశ్వరరెడ్డి విచారణ జరిపి ప్రాథమిక నివేదిక అందజేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మలాంషావలి తీరుపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, గతంలో పని చేసిన ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, మధ్యాహ్నభోజన నిర్వాహకులను డీఈఓ విచారించారు. సేకరించిన వాస్తవ పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని డీఈఓ తెలిపారు. అంతకుమునుపు ఆయన ఎండీఎంఏడీ రవికుమార్‌తో కలిపి మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు నరసింహారెడ్డి, ఎంఈఓ మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ గోవిందు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



వృద్ధురాలు కీరవాణి మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొనడంతో కీరవాణి(60) అనే వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం, సీటీఎం గ్రామం, పడమటివీధికి చెందిన మురళీ భార్య కీరవాణితో కలిసి బైక్ మీద సీటీఎం సమీపంలో తమకు ఉన్న కళ్యాణ మండపం వద్దకు వచ్చి శనివారం మధ్యాహ్నం ఇంటికి తిరుగు ప్రయాణంలో సీటీఎం క్రాస్ వద్ద మదనపల్లె ఆర్టీసీ అద్దె బస్సు ఓవర్‌టేక్ చేస్తూ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందగా మురళికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే మృతురాలి బంధువులు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ జానకీరాంను చితకబాదారు. కేసు ఏమీ వద్దని మృతదేహాన్ని అక్కడ నుంచి సీటీఎంకు తీసుకెళ్లారు. వెంటనే తాలుకా పోలీసులు రంగ ప్రవేశం చేసి మృతదేహాన్ని పరిశీలించి పోర్టుమార్టం నిమత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ అద్దె బస్సును తాలుకా స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి



ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ శనివారం రాయచోటి పట్టణంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట కార్మికుల కుటుంబాలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతులూరి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కాంట్రాక్ట్ కార్మికులన్నీ రెగ్యులర్ చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షల రూపాయలు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అది పరిష్కారం కాకపోతే అక్టోబర్ 6న తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేస్తామన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం అధ్యక్షులు సుబ్రమణ్యంరాజు, ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి హరి, ఏవీ రమణ, రెడ్డెప్ప, కిరణ్, శ్రీనివాసనాయుడు, మన్నాథ్‌రెడ్డి, రామాంజి, శ్రీనివాసులు, స్వాతి, సుజాత, సరస్వతి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాయచోటి, రాజంపేట డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, సురేంద్ర, మదనపల్లి, పీలేరు డివిజన్ నుంచి కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం ధర... దయనీయం

● గోడౌన్లలో మగ్గుతున్న నిల్వలు ● నిరాశపరుస్తున్న వడ్ల ధరలు ● ఆందోళనలో రైతన్నలు



రైతులు గోడౌన్‌లో నిలువ ఉంచిన ధాన్యం బస్తాలు

దువ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ధరలు రైతన్నలను తీవ్ర నిరాశపరుస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన వడ్లకు గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో సంబంధిత రైతులు దిగాలు పడుతున్నారు. కిందటి సంవత్సరం డిసెంబరులో చేతికి వచ్చిన పంటకు సరైన ధర రాకపోవడంతో గోడౌన్లలో నిలవ ఉంచారు.

పేరుకుపోయిన నిల్వలతో ఆందోళన

నియోజవకర్గంలోని చాపాడు, దువ్వూరు, ఖాజీపేట మండలాల్లో కేసీ ఆయకట్టులో విస్తృతంగా వరి సాగవుతోంది. కిందటి సంవత్సరం 37 వేల ఎకరాల్లో వరిసాగైనట్లు వ్యవసాయశాఖ తెలుపుతోంది. ఈ సమయంలో ఆశించిన ధరలేకపోవడంతో రైతులు పండిన పంటను ఇళ్లలో, గోడౌన్లలో నిలువ ఉంచారు. మొత్తంగా 12 లక్షల బస్తాలు నిలువ ఉంటాయనేది ప్రాథమిక సమాచారం. వందల మంది రైతులు గిట్టుబాటు ధర కోసం నిరీక్షిస్తున్నారు.

ధర రాక ధాన్యం విక్రయించలేదు



గత ఏడాది పండించిన ధాన్యానికి ఇప్పటికీ సరైన ధర రాలేదు. 13 ఎకరాల్లో వరి పంట సాగు చేసి.. వచ్చిన దిగుబడిని గోడౌన్‌లో అలాగే నిలువ ఉంచాను. సంచుల ఖర్చు, నిలువ చార్జీలు, తరుగుదల ఇలా లెక్కలు వేస్తే ధర గిట్టుబాటు కావడం లేదు. పండిన వెంటనే విక్రయించి ఉంటే బాగుండేది. పది నెలలుగా వడ్లను అలాగే నిలువ ఉంచాను.

- జయరామక్రిష్ణారెడ్డి, రైతు, ఎర్రబల్లి గ్రామం, దువ్వూరు మండలం

పెరగని ధరలు - నిలువల్లో తరుగులు

రెండేళ్లుగా గోడౌన్లలో ధాన్యం నిలువలు పేరుకుపోతున్నాయి. ధర గిట్టుబాటు కాదని.. విక్రయించేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. గత డిసెంబరులో నిలువ ఉంచిన ధాన్యం రేటు పెరుగలేదు. అంతకుముందు సంవత్సరం ధాన్యానికి మాత్రం కొంత రేటు ఉంది. బస్తా రూ.2,300 ధర పలుకుతుండడంతో వాటికి సంబంధించి విక్రయాలు కొనసాగుతున్నాయి. నిరుడు ధాన్యం బస్తా రూ.1900 మాత్రమే ధర ఉండడంతో విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. పంట చేతికందే సమయంలో ఇదే ధర ఉండేది. పాత ధాన్యానికి మాత్రం ధర విషయంలో కొంత మార్పు చోటు చేసుకుంది. నిలువ ఉంచిన ధాన్యానికి తరుగుతు పోతుందని.. ధరలు మాత్రం పెరగడం లేదని రైతులు వాపోతున్నారు. వడ్ల రకాలను బట్టి ధరల్లో మార్పు చోటు చేసుకుంటోంది.

అయోమయంలో రైతులు

వరిసాగు చేస్తున్న రైతుల్లో అయోమయం నెలకొంది. సాగు ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు ధరలు పెరడంలేదని వీరి వాదన. సాగునీరు ముందుగానే రావడంతో నియోజకవర్గంలో మరో రెండు వేల ఎకరాల మేర ఈ ఏడు విస్తీర్ణం పెరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. రైతు పండించిన ధాన్యాన్ని వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఇదే వ్యాపారులు మార్కెట్‌లో విక్రయిస్తున్న బియ్యానికి మాత్రం ధర తగ్గడం లేదు. ఈ తతంగం వెనుక మతలబు ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాము ఆరుగాలం కష్టించి పండిస్తే గిట్టుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు జడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎంపిక



కర్రసాము చేస్తున్న విద్యార్థినులు

చెన్నూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఎంపికల్లో భాగంగా మండలంలోని రామనపల్లె జడ్పీ ఉన్నత పాఠశా లలో జిల్లా స్థాయిలో నిర్వహించిన కత్తి సాము, కర్రసాము పోటీల్లో రామనపల్లె విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా అండర్ 19 బాల బాలికల పోటీల్లో కత్తిసాము, కర్రసాము పోటీల్లో పలు మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ మెంబరు గణేశ్‌బాబు, వసంత్, ఫాతిమా, ప్రశాంతి, నాగేశ్వర్‌రెడ్డితో పాటు సెక్రటరీ చంద్రమౌళిరాజు, చంద్రావతి పాల్గొన్నారు. కత్తిసాములో నందిని, నాగచైతన్య, సుశాంతి ఎంపిక కాగా, కర్రసాములో శిరీష, వరుణ్ ఎంపికయ్యారు. వీరంతా త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనన్నుట్లు హెచ్‌ఎం తెలిపారు.

ఆటో డ్రైవర్ రసూల్‌పై త్రీటౌన్ సీఐ దాడి

● అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా



నిరసన వ్యక్తం చేసున్న ప్రజాసంఘాల నేతలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ యానాది కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ రసూల్‌పై త్రీ టౌన్ సీఐ వేణుగోపాల్ స్టేషన్లో దాడి చేసి బూతులు తిడుతూ కొట్టాడని ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ ఆరోపించారు. ఇందుకు నిరసనగా శనివారం స్థానిక పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ ఆటో డ్రైవర్ కుమారుడు మహ్మద్ తన స్నేహితిరాలిని తీసుకు వెళ్లాడని ఆ అమ్మాయి తల్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ ఆటో డ్రైవర్ రసూల్‌ను స్టేషనుకు పిలిపించి నీచంగా మాట్లాడాడని, ప్రశ్నించి నందుకు కొట్టాడని ఆరోపించారు. ప్రేమికులు పారిపోతే వారు ఎక్కడున్నారో కనుక్కొని ఇంటికి తీసుకురావాలి కానీ పోలీసులు తల్లిదండ్రులను పోలీసు స్టేషన్లో అక్రమంగా నిర్బంధించి కొట్టడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, విరసం వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, మహిళా శక్తి కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



ద్విచక్ర వాహనాలు, దొంగను చూపుతున్న పోలీసులు

మైదుకూరు సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు తెలంగాణలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన దొంగను బ్రహ్మంగారిమఠం పోలీసులు అరెస్టు చేసినట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. కడప పట్టణం అశోక్ నగర్‌కు చెందిన గణేష్ బ్రహ్మంగారిమఠం వద్ద ఓ వ్యక్తిని బెదిరించి ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లడంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు నిఘానేత్రాల ద్వారా గుర్తించి వాహనాల తనిఖీలో పట్టుకొని విచారించామన్నారు. నిందితుడిపై రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు తెలంగాణాలో కూడా వివిధ రకాల కేసులు ఉండడంతో అరెస్టు చేసి, రూ.5లక్షలు విలువ చేసే 10 ద్విచ క్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సీఐ శివశంకర్, ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బందిని అభినందిస్తూ రివార్డులను అందించారు.

ముగ్గురు దొంగలు అరెస్టు

వేంపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం గండి రోడ్డులోని పిల్లస్వామి గుట్ట జగనన్న కాలనీలోని ఓ ఇంటిలో చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను రెండురోజుల్లోనే వేంపల్లె పోలీసులు పట్టుకున్నారు. కాలనీలో నివాసముంటున్న నాగేంద్ర, వాణి దంపతులు పనులకు వెళ్లిన సమయంలో ఈనెల 18వ తేదీ ఇంట్లోకి ప్రవేశించి బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ముగ్గురు దొంగతనం చేసినట్లు తేలింది. పులివెందుల డీఎస్పీ ఆధ్వర్యంలో అదే ప్రాంతానికి చెందిన షేక్ ఖాదర్‌వలి మరో ఇద్దరు మైనర్లను సీఐ నరసింహులు, ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్‌లు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 6.6తులాల బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసూరివారిపల్లి పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై తిరుపతి నుంచి వస్తున్న లారీ కోడూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొనడంతో ఇరువురు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురిని స్థానికులు 108 వాహనంలో కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బొలేరో వాహనం డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతిలోని రూయా అసుపత్రికి తరలించారు. ప్రధాన రోడ్డుపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగింది. పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధంచారు.

ఆర్టీపీపీలో ఆధిపత్యపోరు

● జేఏసీ వర్సెస్ తెలుగునాడు కార్మిక సంఘాల మధ్య ఘర్షణ ● ఇద్దరికి స్వల్ప గాయాలు





ఆర్టీపీపీలో రిలే దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు, మెయిన్‌గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న తెలుగునాడు కార్మిక సంఘం నేతలు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా పోరాడి కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన కార్మిక సంఘాలు ఆర్టీపీపీలో ఆధిపత్యపోరు ప్రదర్శిస్తూ ఘర్షణకు పాల్పతుడుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఆర్టీపీపీలో ఉద్యోగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ 15వ తేదీ నుంచి దశలవారీగా ఆందోళన చేస్తోంది. అందులో భాగంగా శనివారం రిలే దీక్షలు చేపట్టింది. అయితే అదే సమయంలో తెలుగునాడు కార్మిక సంఘం కొన్ని కార్మిక సంఘాల మద్దతుతో గేటు ఎదుట ధర్నా చేస్తున్నారు. జేఏసీ నాయకులు ప్లాంటు లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఆందోళన చేస్తుండగా లోపలికి ఎలా వెళ్తారంటూ జేఏసీ నాయకులను తెలుగునాడు అడ్డుకుంది. దీంతో అక్కడ తోలుపులాట జరిగి తెలుగునాడు కార్మిక సంఘం నాయకులు పులి సుధాకర్‌రెడ్డి, మనోహర్‌కు గాయాలయ్యాయి. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెల కొంది. ఇది చిలికిచిలికి గాలివానలా రాజకీయ జోక్యం వరకు వెళ్లింది. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు పోలీసుస్టేషన్‌కు పిలిపించి పంచాయితీ చేశారు. ఇందులో భాగంగా జేఏసీ నాయకులు జగదీష్ తదితరులు మెయిన్‌గేటు దగ్గరలో ఉన్న జేఏసీ శిబిరంలో మాట్లాడుతూ జాయింట్ యాక్షన్ కమిటీ తరుపున ఏదైనా పొరపాటు జరిగివుంటే దానికి పూర్తి బాధ్యతగా క్షమాపణ చెబుతున్నట్లు బహిరంగంగా పేర్కొన్నారు. పులిసుధాకర్‌రెడ్డి, మనోహర్ టీఎన్‌టీ యూసీ ఇతరులెవరైనా సరే ఈ పోరాటం ఆగేందుకు ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కారం చేయాలని.. అప్పుడు మేమం దరం మీవెంట నడుస్తామని ప్రకటించారు. గత ఐదేళ్లుగా ఈ సమస్యలు పరిష్కరించలేదని, ఈఐదేళ్లలో కూడా తమకు న్యాయం జరిగేది లేదని కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు గుసగుసలాడు కోవడం కొసమెరుపు. నాయకులు ఆదిపత్యపోరు, ఉనికి కాపాడు కోవడం తప్ప తమకు ఒరింగిందేమిలేదని చెవులుకొరుక్కుంటున్నా రు.

రేపటి నుంచి దసరా సెలవులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని గవర్నమెంట్, మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలలకు 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు డీఈవో షంషుద్దీన్ శనివారం తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని, ఉత్తర్వులు ఉల్లంఘిస్తే యాజ మాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం



మిల్లెట్స్ మేళాను సందర్శిస్తున్న అధికారులు

సీకేదిన్నె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని కృషి విజ్ఞానకేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ తెలిపారు. కృషి విజ్ఞానకేంద్రం ఊటుకూరులో శనివారం ఘనంగా మిల్లెట్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగి, కొర్ర, సజ్జ, జొన్నలు వంటి చిరుధాన్యాలపై మక్కువ పెంచుకుని వాటిని ఇష్టంగా తిని ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. రైతులు తక్కువ ఖర్చుతో సాగు చేసి అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చన్నారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం ద్వారా చిరుధాన్యాల ఆవశ్యకతను ప్రపంచం మొత్తం గుర్తించిందన్నారు.

మెప్మా పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూచిరుధాన్యాల వ్యాపారవేత్తలను ప్రోత్సహించి ప్రాసెసింగ్ యూనిట్లను రైతు సోదరులు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పిస్తుందన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాలకు ప్రధాన సమస్య యాంత్రీకరణ అని, దానిని అధిగమించి చిరుధాన్యాల్లో ప్రాసెసింగ్ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రెడ్డికుమార్, శారద, శాంతిప్రియ చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త బాలకృష్ణ, ఏరువాక కేంద్రం సమన్వయకర్త క్రిష్ణప్రియ, శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, సురేష్‌కుమార్‌రెడ్డి, మానస, రైతులు, కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు మిల్లెట్‌మేళాను సందర్శించారు.

తప్పిపోయిన పిల్లలు.. తల్లిదండ్రుల చెంతకు!

● కడప తాలూకా పోలీసులకు ప్రజల మన్ననలు



బాలురను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కడప క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఇద్దరు బాలురను కేవలం గంటల్లోనే గుర్తించి తిరిగి వారిని వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చి ప్రజల మన్ననలు పొందారు. కడప తాలుకా సీఐ టి.రెడ్డప్ప వివరాల మేరకు.. నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద ఉన్న సాయిబాబా స్కూలులో 8వతరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు టి.కౌశిక్ కుమార్‌రెడ్డి, ఎస్.ప్రణయ సాయిరెడ్డిలు ఇద్దరూ స్నేహితులు. అయితే శుక్రవారం మధ్యాహ్నం 1.30గంలకు స్కూలు నుంచి కనిపించకుండా వెళ్లిపోయారు. వారి కోసం ఎంత వెదికినా ఆచూకీ లభ్యం కాక తల్లిదండ్రులు, స్కూలు యాజమాన్యం శుక్రవారం సాయంత్రం తాలుకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్య వేక్షణలో పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. బృందాలుగా విడిపోయి నగరం నలుమూలలా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ టీవీల రికార్డులు పరిశీలించి.. గంటల వ్యవధిలోనే ఆ బాలురు తిరు పతి రైల్వేస్టేషనులో ఉన్నట్లు గుర్తించారు. పోలీసు సిబ్బందిని తక్ష ణమే తిరుపతి రైల్వేస్టేషనుకు పంపి విద్యార్థులను సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈసందర్భంగా కడప తాలుకా పోలీసు యంత్రాంగానికి బాలుర తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపా రు. కాగా, తప్పిపోయిన బాలురను అతికొద్దిగంటల్లోనే గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన తాలుకా సీఐ రెడ్డప్ప, ఎస్‌ఐ తాయార్ హుసేన్, సిబ్బందిని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అభినందించారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా విద్యాసంస్థలు విద్యార్థుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు.

శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరం



పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో చిరుధాన్యాల ప్రాసెసింగ్‌ను వివరిస్తున్న డాక్టర్ సాయిశ్రీనివాస్

పులివెందుల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలు, పండ్లు పండిస్తున్న రైతులకు ఏర్పాటు చేస్తున్న శిక్షణా కార్యక్ర మాలు ఎంతో ఉపయోగకరమని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ అన్నారు. శని వారం ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల బెంగుళూరు ఐఐ పీఎం, ఫ్రెండ్స్ ఆఫ్ ఉమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్ సొసైటీ సంయు క్తంగా చిరుధాన్యాల విలువ జోడింపు, మార్కెటింగ్ మరియు బ్రాండింగ్ అనే అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. ఈసందర్భంగా డీఎన్ మాధవ మాట్లాడుతూ పండ్లు, చిరుధాన్యాలు ప్రాసెసింగ్ పద్ధతులు తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరమన్నారు. జ్యూస్ బాటిలింగ్, ఆటోమేటిక్ యంత్రా లు, చిరుధాన్యాల శుభ్ర పరిచే యంత్రాలు, చిరుధాన్యాల నుంచి రవ్వ, పిండి చేసే యంత్రాలను ఉపయోగించి ఆహార పదార్థాలు తయారు చేసే ప్రక్రియను శిక్షణా కార్యక్రమానికి వచ్చిన రైతు లకు ప్రత్యక్షంగా వివరించారు. అలాగే కళాశాల అధ్యాపకులు ఇంజనీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్ కళాశాలలోఉన్న లైవ్లీ_హుడ్ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఉన్న యంత్రాల పని తీరును వివరిస్తూ సాంకేతిక సమాచారాన్ని రైతు లకు అందిం చారు. పండ్లతో కస్టర్డ్ డ్రింక్, జల్ జీరా డ్రింక్, జామ్, జెల్లీ, రక రకాల చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే విధాన ప్రక్రియలో కూడా స్వయంగా రైతులు పాల్గొన్నారు. కార్య క్రమంలో ఐపీఎం ప్రతినిధి డాక్టర్ నబీరసూల్, కళాశాల అధ్యా పకులు డాక్టర్ రాజేష్, డాక్టర్ జాకీర్ బాష, పీడీ డాక్టర్ రాజశేఖ ర్, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల సొసైటీ సభ్యులు, ఎఫ్‌పీఓలకు చెందిన రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ఫస్ట్, సెకండ్, థర్డ్ బీటెక్ కోర్సులకు సంబంధించి రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు శనివారం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మేనెలలో బీటెక్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. సీఎస్‌ఈ, ఈఈఈ, ఈసీఈ, ఎంఎంటీ, ఎంఈ విభాగాల ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. పరీక్షల విభాగాన్ని, ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రశంసించారు. రిజిస్ట్రార్ పి.పద్మ, ప్రిన్సిపాల్ బి.జయరామిరెడ్డి, ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, పరీక్షల కంట్రోలర్ ప్రొఫెసర్ కృష్ణారావు, అసిస్టెంట్ కంట్రోలర్స్ సుభోస్‌చంద్ర, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్

● 19 మంది ఎంపిక



విద్యార్థులకు నియామకపత్రాలు అందిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయ భారతి ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన క్యూస్పైడర్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ డ్రైవ్‌లో ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్, ఎంఎస్సీ డేటా సైన్స్ విభాగాల విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా ప్రతిభావంతులను కంపెనీ ప్రతినిధులు ఐశ్వర్య, అరు ణిమలు ఎంపిక చేశారు. 19 మంది విద్యార్థులు ప్రోగ్రామింగ్ డెవలపర్ ఉద్యోగాలను సాధించారు. ఎంపికైన వారికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు నియామకపత్రాలను అందించారు. పీజీ చదువుతూనే రూ.3లక్షల నుంచి రూ.9లక్షల వరకు వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందడం విశేషమని వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు డాక్టర్ కె.లలిత, డాక్టర్ రెడ్డయ్య, డాక్టర్ గణేష్‌నాయక్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

వేంపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు వేతనాల కోసం ధర్నా చేపట్టారు. శనివారం కార్యాలయం వద్ద చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే ఏం తిని బతకాలి అంటూ ఆక్రోశం వెలిబుచ్చారు. మొన్నటి వరకు ఈఓ లేనందున ఇవ్వలేకపోతున్నామంటూ చెప్పుకొచ్చిన అధికారులు ప్రస్తుతం ఈఓ ఉన్నప్పటికీ ఎందుకు ఇవ్వడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనే యులు, చల్లా బాలాజీ తదితరులు పారిశుధ్య కార్మికులకు సంఘీభావంగా ఆందోళనలో పాల్గొన్నా రు. కాగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓ నాగభూష ణంరెడ్డి తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి

సీకేదిన్నె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో 1985-89 ఇంజనీరింగ్ పట్టభద్రుల విద్యార్థుల కలయిక ఎంతో ఉత్సాహంగా జరిగింది. శనివారం కేఎస్ఆర్ఎం ఫ్రెండ్స్ అసోసియేషన్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వివిధ దేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కళాశాలలో కలుసుకుని మధురానుభూతులు పంచుకున్నారు. తమ అసోసియేషన్ ద్వారా 2017 నుంచి ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనపరిచినవారికి రూ.5 వేలు నగదు ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ టీఎన్ ప్రసాద్, డీన్ అమర్‌నాథ్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పురుషోత్తంరెడ్డి, సృజన్‌కుమార్

కడప రూరల్, సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 17 జిల్లా స్థాయి ఎంపికలో కడప నగరానికి చెందిన పి.పురుషోత్తరెడ్డి రైఫిల్ షూటింగ్ విభాగం, గడ్డం సుజన్‌కుమార్ కర్రసాము విభాగంలోను చక్కని ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రొద్దుటూరు జార్జ్ క్లబ్‌లో అండర్ 17 ఏఆర్ పిస్టోల్ షూటింగ్ విభాగంలో కడప నగరంలోని విజ్‌డమ్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పి. పురుషోత్తరెడ్డి సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే సిద్దవటం మండల కేంద్రంలో నిర్వహించిన అండర్ 17 కర్రసాము క్రీడలో సాయిబాబా స్కూల్‌లో 8వ తరగతి చదువుతూ జేసీఎస్ జెసిఎస్ కలవరియపట్టు అకాడమీలో శిక్షణ పొందుతున్న గడ్డం సుజన్‌కుమార్ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు పి. రామగంగిరెడ్డి, గడ్డం శ్రీనివాసులు,ఆయా పాఠశాలల కరస్పాండెంట్స్, ప్రిన్సిపాల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తంచేశారు.

పశువులకు గర్భకోశ వ్యాధుల ఉచిత చికిత్స శిబిరం

వల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెరువుకిందపల్లెలో శనివారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఉపసంచాలకులు ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి పశువుల్లో మేలైన యాజమాన్య పద్ధతులు ఎలా వాడాలో వారికి వివరించారు. డాక్టర్ మారుతీప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వం రూ.1350 ధరకు నిర్ణయించిన లింగ నిర్ధారణ వీర్యం రైతులు రూ.150 చెల్లిస్తే అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌రెడ్డి, మండల పశుసంవర్ధకశాఖ సిబ్బంది, గ్రామ పాడిరైతులు పాల్గొన్నారు.

'వైసీపీ హయాంలోనే ఎస్సీలకు సముచిత స్థానం'

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం లభించిందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష తెలిపారు. శనివారం కడపనగరం ఓల్డ్ రిమ్స్ బీసీ భవన్‌లో ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షుడు సుధాకర్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారావు, దేవసాని ఆదిత్యరెడ్డి, నిత్యానందరెడ్డి, యానాదయ్య, పులిసునిల్‌కుమార్, బుసిపాటి కిశోర్, ఇలియాస్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పులివెందుల రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ రాముడు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగాపట్టణంలో ఆకుపచ్చ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్, డ్వామా అధికారులు,సిబ్బంది, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ దేవత విగ్రహం వితరణ

సింహాద్రిపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురంలో వెలసిన పెద్దమ్మ దేవత వద్ద నిర్వహించే దసరా ఉత్సవాల్లో భాగంగా ఫిజియోథెరపీ సాయి కుమార్ అమ్మవారి విగ్రహాన్ని వితరణగా అందజేసినట్లు ధర్మకర్త శివ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ యేడు 11 రోజులు రోజుకు ఒక అలంకరణలో కనిపించే అమ్మవారిని దర్శించుకుని, దసరా ఉత్సవాల్లో భక్తులు పాల్గొని పెద్దమ్మ దేవత కృపకు పాత్రులు కావాలని కోరారు.

అలా వదిలేశారు..!



అసంపూర్తిగా ఉన్న జె.కొత్తపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల భవనం

●అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పాఠశాల భవనాలు

సీకేదిన్నె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):చింతకొమ్మదిన్నె మండలం జె.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 19 గదుల నిర్మాణం కోసం రూ.2.80 కోట్లతో నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అయితే ప్రభుత్వం నాడు-నేడుకింద చేపట్టిన పనులు పూర్తికాకపోవడంతో అక్కడ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఏర్పడింది. అక్కడ ఎవరూ ఉండకపోవడంతో, ఎటువంటి రక్షణ లేకపోవడంతో మందుబాబులు మద్యం తాగి బాటిళ్లు అక్కడే వేస్తున్నారు. గతంలో ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి స్థానికుల సహకారంతో త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేసినప్పటికీ పూర్తిస్థాయిలో పనులు కాకపోవడంతో భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి.

● **పది గదులు పూర్తి..:** పాఠశాల భవనాలకు ప్రస్తుతం విద్యార్థుల అవసరానికి తగినట్లు గ్రౌండ్‌ఫ్లోర్‌లో 10 భవనాలు పూర్తయ్యాయి. వాటికి కిటికీలు, తలుపులు కూడా బిగించారు. సున్నం వేస్తే తరగతి గదులు వాడుకుని విద్యాకేంద్రంగా వెలిసేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. మొదటి అంతస్థులో నాలుగు రూములకు శ్లాబ్ కూడా పూర్తయింది. ఇంకా రెండు రూములు శ్లాబ్ పూర్తయి గోడలు అసంపూర్తిగా ఉన్నాయి. అయినప్పటికీ కింద తరగతి గదులు వాడుకునేందుకు అన్ని విధాలా అనుకూలంగా ఉంది. ఇప్పటికైనా పాఠశాల ఇరుకుగదుల్లో లేకుండా నూతనంగా నిర్మించిన భవనాల్లోకి మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మరుగుదొడ్లు లేవు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకోసం నిర్మించిన భవనాల్లో బాలబాలికలకు అవసరమైన వాష్‌రూములు లేవు. దీంతో అక్కడికి తరగతులు మార్చాలంటే ఇబ్బందిగా ఉంది. మరుగుదొడ్లు నిర్మిస్తే కిందిభాగంలోని 10 రూముల్లో తరగతులు ప్రారంభించవచ్చు. విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

- హెచ్‌ఎం భాగ్యలక్ష్మి

● **నిలుస్తున్న వర్షం నీరు..:** మొదటి అంతస్తులో నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో వర్షం నీరు బిల్డింగ్‌పైనే నిలిచిపోతోంది. దీంతో ఆ వర్షపునీరు మెట్ల ద్వారా కిందకు గోడల ద్వారా లీకవుతూ వస్తోంది. ఇలాగే వదిలేస్తే పాఠశాల భవనాలు త్వరగా దెబ్బతింటాయి.



మందుబాబులు తాగిన మద్యం బాటిళ్లు

ఎస్పీని కలిసిన పలువురు టీడీపీ నేతలు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ను టీడీపీ నేతలు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, వీఎస్ అమీర్‌బాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీని సత్కరించారు.



ఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి



ఎస్పీని సన్మానిస్తున్న అమీర్‌బాబు

రేపటి నుంచి గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రులు

వీరపునాయునిపల్లె,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలపనూరు ఆశ్రమంలో వెలసిన గంగమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రుల పూజలు ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహించనుననట్లు నిర్వాహకుడు నాగిరెడ్డి తెలిపారు. 22న కలసస్థాపన, గజలక్ష్మి దేవి అలంకరణలో శరన్నవరాత్రులు ప్రారంభమవుతాయన్నారు. 23న బాలత్రిపురసుందరిదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న గాయత్రిదేవి, 26న విశిష్టదేవి, 27నభవాని, 28న రాజరాజేశ్వరిదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసురమర్దిని, 2వ తేదీ విజయలక్ష్మీదేవి అలంకరణల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు.

విద్యార్థుల జీవితాలకు వెలుగు దివ్వెలు గురువులు



అధ్యాపకులను సత్కరిస్తున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలకు వెలుగు దివ్వెలై సమాజాన్ని ప్రకాశవంతం చేయడం గురువుల బాధ్యత అని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. శనివారం వైవీయూలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన కెమిస్ట్రీ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు, బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్ ప్రొఫెసర్ కె.రియాజున్నిసాలకు యూటా ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ , ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ ,ఆచార్య ఎంఎం వినోదిని, యూటా అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రతినిధి ప్రొఫెసర్ జి.పార్వతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'దేశంలో దొంగ ఓటర్లు పడ్డారు'

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 20(ఆంధ్ర జ్యోతి): దేశంలో ఓటర్ల దొంగలు పడ్డారని ప్రజా ఓట్ల రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ సంతకాల ఉద్యమాన్ని ప్రారంభించినట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఓటు విలువను చాటి చెప్పాల్సిన బీజేపీ అవకతవకలకు పాల్పడిందన్నారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు రహమతుల్లా ఖాన్ పాల్గొన్నారు.

సీఎం సతీమణిని కలిసిన పులివెందుల జడ్పీటీసీ



పులివెందుల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారాచంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతారెడ్డి కలిశారు. శనివారం అమరావతిలో సీఎం చంద్రబాబు ఇంటికి లతారెడ్డి వెళ్లి నారా భువనేశ్వరికి శాలువ కప్పి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సాయి, నాగార్జున పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



కడప కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): దేవునికడప లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలోని బాలా లయంలో కొలువుదీరిన శ్రీవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. అర్చకులు స్వామి దర్శనభాగ్యం కల్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

23న చలో విజయవాడ

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఈనెల 23న విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద జరుగుతున్న ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు విజయభాస్కర్, నాగేంద్ర, జిల్లా కోశాధికారి గోపి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌లు ప్రకటనలో పిలుపునిచ్చారు. హామీలు అమలు కానిపక్షంలో 23న విజయవాడ కార్యక్రమం నిర్వహించాల్సి వచ్చిందన్నారు.

బలవంతపు భూసేకరణ రద్దు చేయాలి

కడప నాగరాజుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలో పెద్దముడియం, మైలవరం మండలాల్లో సోలార్ ప్రాజెక్టుకు రైతుల నుంచి బలవంతపు భూసేకరణ రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు దస్తగిరిరెడ్డి, అన్వేష్ డిమాండ్ చేశారు. శనివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఈనెల 24న తలపెట్టిన చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన వాతావరణమే స్వచ్ఛతా హీసేవ లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం మంచి మొక్కలు, చెట్లతో లభిస్తుందని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం చెన్నూరులోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో ఎంపీడీవో, టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కె.సురేశ్‌బాబు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్థానిక పాత బస్టాండు కూడలిలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు షబ్బీర్ హుసేన్, గౌస్‌పీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలు, హక్కులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

పులివెందుల,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చట్టాలు, హక్కులు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పులివెందుల అర్బన్ సీఐ సీతారామిరెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం ఆహార విజ్ఞాన శాస్త్ర,సాంకేతిక కళాశాలలో యాంటి ర్యాగింగ్‌పై అవగాహన, మహిళల హక్కులు, చట్టాల గురించి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, స్టూడెంట్ యాక్టివిటీ అధికారి డాకటర్ కీర్తిరెడ్డి, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలు

లింగాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నామని ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటివ్ అధికారి సత్యానందం, లింగాల సహకార సంఘం అధ్యక్షుడు నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. లింగాల సహకారం సంఘంలో శనివారం స్వచ్ఛభారత్ స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలునాటారు. బీజేపీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి, పులివెందుల సబ్ డీఎల్‌సీఓ కమల పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి

వేంపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేంపల్లెలోని కుమ్మరాంపల్లె వద్ద వర్షాలకు దెబ్బతిన్న వరి, టమోట, బెండ పంటలను శనివారం తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ శివశంకర్‌రెడ్డి అధికారులు తెలిపారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

కడప నాగరాజుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లను తక్షణం నెరవేరాల్చని డిమాండ్ చేస్తూ శనివారం కడప ఎస్‌ఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. సీఐటీయూ అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కారం కాకపోతే అక్టోబరు 6నఎస్పీడీసీఎల్ తిరుపతి కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప యూనియన్ ప్రతినిధులు,కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా డబుల్ ఇంజన్ సర్కారు



రక్తదానం చేస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రం,రాష్ట్రంలో డబుల్ ఇంజను సర్కారు (బీజేపీ - కూటమి) పాలన ప్రజల ఆకాంక్షలకనుగుణంగా సాగుతోందని బీజేపీ, బీజేవైఎం నాయకులు పేర్కొన్నారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా చేపడుతున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా బీజేపీ జిల్లా కమిటీ, బీజేవైఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎన్జీవో కాలనీలో ఉన్న బీజేపీ జిల్లా కార్యాలయంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ణయాదవ్, జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, చాగలమర్రి ఓబులేసు, హరిక్రిష్ణ, చేపూరి శారదమ్మ , రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం



మొక్కలు నాటుతున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సలీంబాష పిలుపునిచ్చారు. శనివారం కడపనగరం కోటిరెడ్డి మహిళా కళాశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్‌క్రాస్-క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్, సాస ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని కళాశాలలో మామిడి, నిమ్మచెట్లను నాటారు. అలాగే కంపోస్ట్ గుంత తవ్వి క్లీనింగ్ డ్రైవ్‌లో భాగంగా తొలగించిన మొక్కలతో నింపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సచీదేవి, క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పీపీ సుబ్బారెడ్డి, సాస కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మదన్‌మోహన్, వాహిదా తదితరులు పాల్గొన్నారు.

పండుగకు ఊరికెళ్లొస్తాం...

దసరాకు ఇంటి బాటపట్టిన విద్యార్థులు

కడప కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22 నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. దీంతో వివిధ ప్రాంతాల్లో గల పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ల విద్యార్థులు ఆనందంలో ఇంటి బాట పట్టారు. ఆ క్రమంలో శనివారం కడప ఆర్టీసీ బస్టాండు విద్యార్థులతో కిక్కిరిసిపోయింది. దసరా సెలవులను ఇళ్ల వద్ద ఆనందంగా కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులతో గడిపేందుకై విద్యార్థులు సంబరాలతో ఇంటికి పయనమయ్యారు. దీంతో ఆర్టీసీ డిపో అధికారులు విద్యార్థుల రద్దీకనుగుణంగా వివిధ ప్రాంతాలకు బస్సులను ఏర్పాటు చేశారు.



కొత్తబస్టాండులో ఆటోలుమాట్లాడుకుని ఊరికి వెళుతున్న విద్యార్థులు



దసరా సెలవులకు ఊరికి వెళుతున్న విద్యార్థులతో కిక్కిరిసిన బస్టాండు

ఓటర్ల జాబితాను పరిశీలించండి : ఆర్డీవో

బద్వేలు, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించాలని ఆర్డీవో చంద్రమోహన్ బీఎల్వోలను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బద్వేలు, గోపవరం తహశీల్దార్ల సమక్షంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఆర్డీవో మాట్లాడుతూ 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్లను 2025 ఓటర్ జాబితాలో ఓటర్లుగా నమోదు అయి ఉన్నారో, లేదో పరిశీలించి రెండు రోజుల లోపల పూర్తిచేసి జాబితా పంపాలని ఆయన సూచించారు.

రుణాలు చెల్లించి వడ్డీ రాయితీ పొందండి

అట్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సకాలంలో రైతులు రుణాలు చెల్లించి ప్రభుత్వమిస్తున్న వడ్డీ రాయితీని పొందాలని జిల్లా సహకార పరపతి సంఘం కార్యనిర్వహణాధికారి రాజామణి తెలిపారు. శనివారం ఆమె అట్లూరు సహకార పరపతి సంఘంను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి రైతుల వద్దకు వెళ్లి సకాలంలో రుణాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజరు చంద్రశేఖర్, మేనేజరు నరసయ్య, సిబ్బంది ఉన్నారు.

రాజోలి ప్రాజెక్టును నిర్మించాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజోలి ఆనకట్టను 2.95 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం చేపట్టాలని సీపీఐ జమ్మలమడుగు నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ బృందం రాజోలి ప్రాజెక్టును సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే నాలుగు నియోజకవర్గాల్లోని వేలాది ఎకరాల్లో పొలాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రాంప్రసాద్, నాగేంద్ర, సంజీవ, కంబయ్య, తిరుమలరాయుడు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన చీఫ్ కమిషనర్

చాపాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచారశాఖ చీఫ్ కమిషనర్ ఆర్.మహబూబ్‌బాష, ఆయన భార్య జరీనా శనివారం నక్కలదిన్నె ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని హెడ్మాస్టర్ గౌరీలతను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేసి బాగుందని చెప్పారు. తాను ప్రాథమికోన్నత విద్యను ఈ పాఠశాలలోనే 1971లో అభ్యసించినట్లు చెప్పారు.

మహారాజశ్రీ బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No. 146/2024

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అశోక్‌నగర్ బ్రాంచ్ వారి తరపున బ్రాంచ్ మేనేజర్, బద్వేలు, వైఎస్ఆర్ కడపజిల్లా - వాది

V/s

బోరెడ్డి నారాయణరెడ్డి తండ్రి రామక్రిష్ణరెడ్డి, రాజుపాళెం గ్రా., బి.కోడూరు మం., వైఎస్.ఆర్. జిల్లా - ప్రతివాది

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీపైన లోను బాకీ రూ. 2,72,337/-లు రాబట్టుకొనుటకుగాను దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకేమైనా ఆక్షేపణలున్న యెడల 23-9-2025వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షముగా దావాను తీర్మాణించబడును.

ప్రదీప్ కుమార్ పవార్, నూతి శ్రీనివాసులు
వాది తరపు అడ్వకేట్స్ బద్వేలు,వై.ఎస్.ఆర్. కడపజిల్లా

మహారాజశ్రీ బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No. 148/2024

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అశోక్‌నగర్ బ్రాంచ్ వారి తరపున బ్రాంచ్ మేనేజర్, బద్వేలు, వైఎస్ఆర్ కడపజిల్లా - వాది

V/s

శ్రీ వీరభద్ర గార్మెంట్స్, ప్రొ.. టి. విజయ్‌కుమార్, డి.నెం. 4-1-199, అంజనేయనగర్, బద్వేల్‌టౌన్ & మున్సిపాలిటి, వైఎస్.ఆర్. జిల్లా - ప్రతివాది

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీపైన లోను బాకీ రూ. 2,50,128/-లు రాబట్టుకొనుటకుగాను దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకేమైనా ఆక్షేపణలున్న యెడల 25-9-2025వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షముగా దావాను తీర్మాణించబడును.

ప్రదీప్ కుమార్ పవార్, నూతి శ్రీనివాసులు
వాది తరపు అడ్వకేట్స్ బద్వేలు,వై.ఎస్.ఆర్. కడపజిల్లా

మహారాజశ్రీ బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No. 259/2024

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మైదుకూరు రోడ్ బ్రాంచ్ వారి తరపున బ్రాంచ్ మేనేజర్, బద్వేలు, వైఎస్ఆర్ కడపజిల్లా - వాది

V/s

నేలటూరు సిద్దయ్య తండ్రి పెద్దసిద్దయ్య, హరిజనవాడ, డి.నెం. 20-48/1, గూడెంగ్రామం, బద్వేల్ మండలం వైఎస్.ఆర్. జిల్లా - ప్రతివాది

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీపైన లోను బాకీ రూ. 60,047/-లు రాబట్టుకొనుటకుగాను దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకేమైనా ఆక్షేపణలున్న యెడల 25-9-2025వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షముగా దావాను తీర్మాణించబడును.

ప్రదీప్ కుమార్ పవార్, నూతి శ్రీనివాసులు
వాది తరపు అడ్వకేట్స్ బద్వేలు,వై.ఎస్.ఆర్. కడపజిల్లా

మహారాజశ్రీ బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 557/2025, in I.A. No. 633/2023 in O.S. No. 177/2023

1) కలవకూరి చిన్నచెన్నుగారి గురవయ్య తండ్రి అయ్యన్న, హిందూ, వయసు సుమారు 40 సంవత్సరాలు, వ్యవసాయం, కమ్మవారిపల్లె గ్రామం, రంగసముద్రం పోస్ట్, పోరుమామిళ్ల మండలం, కడపజిల్లా.
2) కలవకూరి చిన్నచెన్నుగారి రవి తండ్రి అయ్యన్న, హిందూ, వయసు సుమారు 36 సంవత్సరాలు, వ్యవసాయం, కమ్మవారిపల్లె గ్రామం, రంగసముద్రం పోస్ట్, పోరుమామిళ్ల మండలం, కడపజిల్లా.
3) పునుగుపాటి గురప్ప తండ్రి గురయ్య, హిందూ, వయసు సుమారు 63 సం.రాలు, వ్యవసాయం, కమ్మవారిపల్లె గ్రా., రంగసముద్రం పోస్ట్, పోరుమామిళ్ల మండలం, కడపజిల్లా.
4) చెరుకూరి గురమ్మ భర్త చెన్నకేశవులు, హిందూ, వ: సుమారు 46 సంవత్సరాలు, వ్యవసాయం, కమ్మవారిపల్లె గ్రామం, రంగసముద్రం పోస్ట్, పోరుమామిళ్ల మండలం, కడపజిల్లా. - పిటీషనర్లు / పిటీషనర్లు

V/s

దారపనేని చెన్నకేశవులు (1వ రెస్పాండెంట్) పోతి వారసురాలు దారపనేని చరిత తండ్రి లేట్ దారపనేని చెన్నకేశవులు, భర్త పరుచూరి వెంకటేష్, హిందూ, వయసు సుమారు 26 సంవత్సరాలు, గృహిణీ, తోకలపల్లె గ్రామం, టేకూరిపేట పోస్ట్, పోరుమామిళ్ల మండలం, వైయస్ఆర్‌జిల్లా. -3వరెస్పాండెంట్/ ప్రతిపాదిత 5వ రెస్పాండెంట్

పై నెంబర్ పిటీషన్‌ను, పిటీషనర్లు, షెడ్యూల్ దాఖలా భూమిపైన తమ యొక్క స్వాధీన అనుభవమునకు ఆటంక పరచుచున్నందున, మీ తండ్రి గారైన దారపనేని చెన్నకేశవులుగారు జీవించి ఉన్న కాలంలో అతనిని 1వ రెస్పాండెంట్‌గాను మరియు ఇంకొకరిని 2వ రెస్పాండెంట్‌గాను పేర్కొంటూ, పర్మనెంట్ ఇంజంక్షన్ మంజూరు చేయవలసినదిగాను కోరుతూ రాజశ్రీ పై కోర్ట్ నందు I.A.No. 633/2023 నెంబర్‌గల పిటీషన్‌ను దాఖలు చేసి ఉన్నారు. సదరు పిటీషన్ పెండింగ్‌లో ఉండగానే మీ తండ్రి గారైన దారపనేని చెన్నకేశవులు గారు చనిపోయినందున, మీరు అతని వారసురాలుగా ఉంటూ ఉన్నందున మిమ్ములను పై పిటీషన్ నందు 5వ రెస్పాండెంట్‌గా చేర్చవలసినదిగా కోరుతూ, పిటీషన్లు పై నెంబర్ పిటీషన్‌ను దాఖలు చేసి ఉన్నారు. కావున ఇందు విషయమై మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 22-09-2025 తేదీన ఉదయం గం. 10-30లకు స్వయముగా గాని లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని రాజశ్రీ పై కోర్టు నందు హాజరై మీ సంజాయిషి తెలుపుకొనవలసినది. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూల్: కడప డిస్ట్రిక్ట్, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, బద్వేల్ సబ్-డిస్ట్రిక్ట్, పోరుమామిళ్ల మం., రంగసముద్రం గ్రామపొలంలోని సర్వేనెంబర్ 205, విస్తీరం ఎ.సి. 3.89 సెంట్లు పైకి ఎ.సి. 0.35సెంట్లు (అయితే పేక్కునరి జారిస్ డిక్షన్‌నందు పేర్కొన్న మేరకు ఎ.సి. 0.34సెంట్లకు పరిమితం) ఇందుకు హద్దులు: తూర్పు- కలవకూరి శాంతి కుమారి భూమి, పడమర - దారపనేని చెన్నయ్య భూమి, ఉత్తరం: రస్తా, దక్షిణం: అంబవరం రవీంద్రనాథ రెడ్డి భూమి

రాజశ్రీ కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు
కె.జి. ప్రభాకర్, కె.ఎస్. శ్రీవాత్సవ
వాదుల తరపు న్యాయవాదులు, బద్వేలు

మహారాజశ్రీ బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 558/2025, in O.S. No.177/2023

1) కలవకూరి చిన్నచెన్నుగారి గురవయ్య తండ్రి అయ్యన్న, హిందూ, వయసు సుమారు 40 సంవత్సరాలు, వ్యవసాయం, కమ్మవారిపల్లె గ్రామం, రంగసముద్రం పోస్ట్, పోరుమామిళ్ల మండలం, కడపజిల్లా.
2) కలవకూరి చిన్నచెన్నుగారి రవి తండ్రి అయ్యన్న, హిందూ, వయసు సుమారు 36 సంవత్సరాలు, వ్యవసాయం, కమ్మవారిపల్లె గ్రామం, రంగసముద్రం పోస్ట్, పోరుమామిళ్ల మండలం, కడపజిల్లా.
3) పునుగుపాటి గురప్ప తండ్రి గురయ్య, హిందూ, వయసు సుమారు 63 సం.రాలు, వ్యవసాయం, కమ్మవారిపల్లె గ్రా., రంగసముద్రం పోస్ట్, పోరుమామిళ్ల మండలం, కడపజిల్లా.
4) చెరుకూరి గురమ్మ భర్త చెన్నకేశవులు, హిందూ, వ: సుమారు 46 సంవత్సరాలు, వ్యవసాయం, కమ్మవారిపల్లె గ్రామం, రంగసముద్రం పోస్ట్, పోరుమామిళ్ల మండలం, కడపజిల్లా. - పిటీషనర్లు / వాదులు

V/s

దారపనేని చెన్నకేశవులు (1వ ప్రతివాది) పోతి వారసురాలు దారపనేని చరిత తండ్రి లేట్ దారపనేని చెన్నకేశవులు, భర్త పరుచూరి వెంకటేష్, హిందూ, వయసు సుమారు 26 సంవత్సరాలు, గృహిణీ, తోకలపల్లె గ్రామం, టేకూరిపేట పోస్ట్, పోరుమామిళ్ల మండలం, వైయస్ఆర్ జిల్లా.
- 3వ రెస్పాండెంట్ / ప్రతిపాదిత 5వ ప్రతివాది

పై నెంబర్ దావాను, వాదులు, షెడ్యూల్ దాఖలా భూమిపైన తమ యొక్క హక్కును నిర్ధారించవలసినదిగాను మరియు పర్మనెంట్ ఇంజంక్షన్ మంజూరు చేయవలసినదిగాను కోరుతూ రాజశ్రీ పై కోర్టు నందు మీ తండ్రి గారైన దారపనేని చెన్నకేశవులు గారు జీవించి ఉన్న కాలంలో అతనిని 1వ ప్రతివాదిగాను మరియు ఇంకను ఇద్దరిని 2,3వ ప్రతివాదులుగాను పేర్కొంటూ దావాను దాఖలు చేసి ఉన్నారు. సదరు దావా పెండింగ్‌లో ఉండగానే మీ తండ్రిగారు అయిన దారపనేని చెన్నకేశవులు గారు చనిపోయినందున మీరు అతని వారసురాలుగా ఉంటూ ఉన్నందును మిమ్ములను పై పిటీషన్ నందు 5వ ప్రతివాదిగా చేర్చవలసినదిగా కోరుతూ, వాదులు పై నెంబర్ దావాను దాఖలు చేసి ఉన్నారు. కావున ఇందు విషయమై మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 22-09-2025 తేదీన ఉదయం గం. 10-30లకు స్వయముగా గాని లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని రాజశ్రీ పై కోర్టు నందు హాజరై మీ సంజాయిషి తెలుపుకొనవలసినది. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూల్: కడప డిస్ట్రిక్ట్, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, బద్వేల్ సబ్-డిస్ట్రిక్ట్, పోరుమామిళ్ల మం., రంగసముద్రం గ్రామపొలంలోని సర్వేనెంబర్ 205, విస్తీరం ఎ.సి. 3.89 సెంట్లు పైకి ఎ.సి. 0.35సెంట్లు (అయితే పేక్కునరి జారిస్ డిక్షన్‌నందు పేర్కొన్న మేరకు ఎ.సి. 0.34సెంట్లకు పరిమితం) ఇందుకు హద్దులు : తూర్పు- కలవకూరి శాంతి కుమారి భూమి, పడమర - దారపనేని చెన్నయ్య భూమి, ఉత్తరం: రస్తా, దక్షిణం: అంబవరం రవీంద్రనాథ రెడ్డి భూమి

రాజశ్రీ కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు
కె.జి. ప్రభాకర్, కె.ఎస్. శ్రీవాత్సవ
వాదుల తరపు న్యాయవాదులు, బద్వేలు

పంటలు వర్షార్పణం

- కుండపోత వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం
- కోతకు గురైన రోడ్లు, నీటమునిగిన పంటపొలాలు
- ఉప్పొంగిన మడమ వంక
- పలుచోట్ల రాకపోకలు బంద్
- సహాయక చర్యల్లో అధికారులు


పెద్దముడియంలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు


రాజుపాళెంలో నీట మునిగిన వరిపంట

జమ్మలమడుగు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలో శుక్రవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి పంటలు భారీగా నీట మునిగాయి. పలుచోట్ల రోడ్లు, వంతెనలు దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాగులు, వంకలు ఉప్పొంగడంతో లోతట్టుప్రాం తాల్లోకి నీరుచేరి జనజీవనం అస్తవ్యస్తమైంది. జమ్మలమడుగు పట్టణంలో లోతట్టు ప్రాంతాలు ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. ఆర్టీసీ డిపో సమీపాన వర్షపునీరు నిలిచి అడుగు తీసి అడుగుపెట్టడానికి వీలుపడక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పీఆర్ హైస్కూలు మైదానంలో మార్కెట్ హైస్కూలు ఆవరణలో ప్రభుత్వ బాలుర వసతి గృహం మున్సిపల్ కార్యాలయం చుట్టూ రోటరీ నగర్ వర్షపునీటితో చుట్టుముట్టింది. అలాగే రైల్వేస్టేషన్, శేషారెడ్డిపల్లె దారిలోని పొలాల్లో, గ్రామంలో రోడ్డు కోతకు గురయ్యాయి. దానవులపాడు, చలివెందుల, దేవగుడి రోడ్లకు ఇరువైపుల వరి పొలాలు, జొన్న పంట నీటమునిగాయి.

పెద్దముడియంలో భారీ వర్షం

జమ్మలమడుగు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలంలో 70 ఏళ్లలో ఎన్నడూ కురవలేనంత వర్షం కురిసిందని గ్రామాల్లోని వృద్ధులు చెబుతున్నారు. ఈ భారీ వర్షానికి పొలాలన్నీ చెరువులను తలపించాయి. ఎక్కడికక్కడ వంకలు వాగులు పొంగి పొర్లాయి. గుండ్లకుంట - మెడిదిన్నె గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురైంది. అలాగే చిన్నపసుపుల, ఉప్పలపాడు గ్రామాల మధ్య రోడ్డు గండి పడి ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అం తరాయం కలిగింది. పెద్దపసుపుల, గుండ్లకుంట, ఉలవపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో బారీ ఎత్తున వర్షం నీరు చేరడంతో ఆయా గ్రామాల్లో జనం ఇబ్బందులు పడ్డారు. అలాగే కుందూనది పోటెత్తింది. వరదనీటితో నెమళ్ల దిన్నె వంతెనపై నీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరా యం ఏర్పడింది. అలాగే నెమళ్లదిన్నె పెద్దపసు పుల, చిన్న పసుపసుల, ఉలవపల్లె, బలపనగూడూరు, చిన్నముడియం, గరిశెలూరు గ్రామాల పరిధిలో రైతులు సాగు చేసిన వరి, కంది జొన్న తదితర పంటల్లోకి వర్షం నీరు పెద్దఎత్తున చేరి పంటలు నీట మునిగాయి. జంగాలపల్లెలో గోడ కూలి రెండు గేదెలకు గాయాలయ్యాయి.

నీటమునిగిన పర్లపాడు ఎస్సీ కాలనీ

రాజుపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుంభవృష్టితో మడమ వంక ఉధృతంగా ప్రవహించి పర్లపడు గ్రామంలోని ఎస్సీ కాలనీ పూర్తిగా నీట మునిగింది. గత వంద సం వత్సరాలుగా ఎన్నడు ఈ కాలనీలలో వర్షం నీరు ప్రవహించలేదని అక్కడి వారు తెలిపారు. శనివారం తహసీల్దారు మనోహరరెడ్డి తన సిబ్బంది సాయంతో కాలనీవాసులందరినీ సహాయక చర్యలు చేపట్టి ఎగువ ప్రాంతాలకు తరలించారు. కొందరి మేకలు మృతి చెందినట్లు సమాచారం. కాలనీవాసులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుతో పాటు వైద్యసిబ్బంది, పశువైద్యాధికారులు, రెవెన్యూ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. విషయం తెలిసిన వెంటనే డివిజనల్ రెవెన్యూ అధికారి సాయిశ్రీ ఎస్సీకాలనీలో పర్యటించారు. ఈ సహాయక చర్యల్లో టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు


ఎర్రగుంట్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో బారీ వర్షంతో వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. నిడుజువ్వి వద్ద వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో గనులకు వెళ్లేందుకు దారి బంద్ అయ్యింది. పెద్దనపాడు వద్ద వంకకు బారీగా వరద నీరు రావడంతో ఎన్‌హెచ్ రోడ్డుపై రాకపోకలు బంద్ అయ్యా యి. కాగా వర్షాలతో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శేషఫణి ప్రజలను కోరారు. వీధుల్లో నీరు వెళ్లేందుకు గల మార్గాలను అన్వేషించి ఎక్స్‌కవేటర్‌తో ఎప్పటిక ప్పుడు నీరునిలవకుండా చర్యలు చేపట్టారు. ఈ సెప్టెంబరు మాసంలో ఎర్రగుంట్ల మండలంలో 390 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. సాధారణ వర్షపాతం 106మి.మీ. కాగా 390మి.మీ. వర్షం కురిసింది.

పెన్నానదిపై తెగిన కాజ్‌వే

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పొద్దుటూరు పట్టణంతో పాటు చుట్టూ గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురియడంతో పొద్దుటూరు పెన్నా నదితోపాటు వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. ముఖ్యంగా ఉప్పువాగు వంక ఉధృతంగా ప్రవ హించి పొలాల్లోకి నీళ్లు పారాయి. తహసీల్దారు గంగయ్య ఆర్ఐ నాగమోహన్ రెడ్డిలు వరద ఉధృతిని పరిశీలించారు. పెన్నానది వద్ద కాజ్‌వే తెగి ఆర్టీపీపీ రాకపోకలు బంద్ అయ్యాయి. కాజ్‌వే కొట్టుకు పోవడం మట్టి రోడ్డు కోసుకు పోవడం పరిశీలించారు. పంట పొలాలు మునిగి పోతే పంట నష్టపరిహారంకు నివేదికలు పంపిస్తామన్నారు. పట్టణంలో కూడా కాలువ లుపొంగి రోడ్లపైకి నీళ్లు ప్రవహించాయి.


జమ్మలమడుగు దానవులపాడులో నీట మునిగిన వరి పొలాలు


జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో భారీగా నిలిచిన వర్షపునీరు


ప్రొద్దుటూరు కొత్తపేట గ్రామంలో జలమయమైన వీధులు

ఆరోపణలు నిరూపిస్తే చర్చకు సిద్ధం

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిరాధారమైన ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ సోషల్ మీడియాలో కొంతమంది చేస్తున్న ఆరోపణలను ఆధారాలతో నిరూపించగలిగితే బహిరంగ చర్చకు సిద్ధమని బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. శనివారం బీజేపీ కార్యాలయంలో పట్టణ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమపై లేనిపోని చౌకబారు ఆరోపణలు చేస్తున్నదెవరో తెలుసునన్నారు. ఒక మాజీ ఎమ్మెల్యే చేతకాని తనం వలన ప్రొద్దుటూరులో జిల్లాస్థాయి కార్యాలయాలను, ఒక మెడికల్ కాలేజీని పోగొట్టుకున్నామని విమర్శించారు. టీడీపీ నాయకుడు, స్థానిక 5వ వార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండండి

దువ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రోష్ని, హేమలత సూచించారు. మండలంలోని పెద్దజొన్నవరం, చల్లబసాయిపల్లెలో శనివారం స్త్రీలకు సంబంధించిన వివిధ రకాల వ్యాధులకు వైద్యసేవలతోపాటు పలు సూచనలు చేశారు. నోటి, రొమ్ము, గర్భాశయ కాన్సర్లపట్ల అనుమానాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

హరితాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హరితాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యమని ప్రభుత్వడిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాముయ్యేల్ డేవిడ్‌రాజ్ అన్నారు.శనివారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో స్వర్ణాంధ్ర., స్వచ్ఛాంధ్ర కోఆర్డినేటరు డాక్టర్ బోవిళ్ల నరసింహారెడ్డి, ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ మల్లిఖార్జున ఆధ్వర్యంలో డిగ్రీకళాశాలలో వంద మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

కలసపాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంచి ఆరోగ్యానికి పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని కలసపాడు వైద్యాధికారి డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజలు పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి సిబ్బందితో కలిసి ఆవరణలో పరసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎమ్‌లు, ఆశాలు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బద్వేలు, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఏపీ గవర్నమెంటు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బద్వేలు యూనిట్ అధ్యక్షుడు శీలం గంగన్న నూతన సబ్ ట్రెజరీ అధికారి సురేష్‌కు విన్నవించారు. అనంతరం నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనను ఘనంగా సన్మానించారు. అధికారిని కలిసిన వారిలో వెంకటలక్షుమ్మ, ట్రెజరర్ సత్తిబాబు, జాయింట్ సెక్రటరీ గురుమూర్తి పాల్గొన్నారు.

ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్య అవసరం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలకు పాఠశాల దశనుంచే ఆత్మరక్షణ విద్య తప్పనిసరి అవసరమని డీఎస్పీ భావన అభిప్రాయ పడ్డారు. శనివారం స్థానిక ఎద్దుల వెంకట సుబ్బమ్మ మున్సిపల్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఆత్మరక్షణ శిక్షణా తరగతులు నిర్వహించారు. మూడు రోజుల శిక్షణ అనంతరం ముగింపు సభలో డీఎస్పీ భావన మాట్లాడుతూ బాలికలు శారీరకంతో పాటు మానసికంగా దృఢంగా తయారవ్వాలన్నారు. సమావేశంలో పలువురు ఉపాధ్యాయులకు మహిళా పోలీసులకు బహుమతులిచ్చి సన్మానించారు. త్రీటౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి పాఠశాల హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

యానిమేటర్ అవినీతి పై విచారణ

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని రామాపురం యానిమేటర్‌పై సంఘ సభ్యులు చేసిన ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టారు. శనివారం శ్రీనిధి ఏజీఎం శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం వెంకటసుబ్బమ్మలు వాస్తవాలపై దర్యాప్తు చేపట్టారు. రామాపురం యానిమేటర్ అనసూయ గత వైసీపీ ప్రభుత్వం చొరవతో బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరైనప్పుడు సభ్యుల వద్ద నుంచి 500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారని శుక్రవారం సంఘ సభ్యులు కడప డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు ఈ ఆరోపణలపై విచారణ చేశారు. విచారణ సందర్భంగా యానిమేటర్, గ్రూపుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది.

వెలిగిన విద్యుత్ దీపాలు



ముద్దనూరు సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రం ప్రధాన రోడ్డులోని నూతన విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు వెలిగాయి. ఈనెల 17వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో అంధకారంలో ప్రధాన రోడ్డు అన్న వార్తా కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఇందుకు స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు .ఈవో లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా అంధకారం ఏర్పడింది అన్న కథనంతో అధికారులు స్పందించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైలవరం విద్యార్థిని ప్రతిభ

మైలవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొమ్మరనంద్యాల జడ్పీ హైస్కూలులో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని నందిని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఆధ్వర్యంలో జరిగిన పోటీ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించినట్లు హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు నరసమ్మ తెలిపారు. న్యూఢిల్లీలోని భారతి మండపంలో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగిన జీ20 దేశాల 59వ ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమీషన్ (ఐఈసీ) టెక్స్‌పోలో నందిని పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం పొందగా అదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి కె.ముక్తేష్ రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానాన్ని పొందినట్లు ఆమె తెలిపారు. ప్రథమ స్థానం సాధించిన నందికి రూ.10 వేలు, ద్వితీయ స్థానం విద్యార్థినికి రూ.7 వేలు అందించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 22 మంది

చాపాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు చిన్నగురవలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెడ్మాస్టర్ నాగరాజు పేర్కొన్నారు. ఈనెల 11, 12, 19, 20 తేదీల్లో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరుల లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో వారిని అధికారులు ఎంపిక చేశారన్నారు. అండర్-14, 17 విద్యార్థులు అర్హత సాధించారు.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కొండాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. మండలంలోని చిన్నపల్లె గ్రామంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫిర్యాదు రహిత గ్రామంగా న్యాయసేవా సంస్థ చిన్నపల్లెను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. 15 రోజులకొకసారి లీగల్ టీం గ్రామంలో పర్యటించి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తారన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, జమ్మలమడుగు బార్ అసోషియేషన్ ప్రెసి డెంట్ దేవగుడి నారాయణరెడ్డి, సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, లాయర్లు చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి , తహసీల్దార్ గురప్ప, ఎంపీడీవో నాగప్రసాద్, సీఐ రాజా, ఎస్సై ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు


ఆధునికీకరించిన రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు కమిటీవారు తెలిపారు. ఈ ఆలయంలో గత 25 సంవత్సరాలుగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడంలో ఆలయ ట్రస్టు కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. 22వ తేదీ రాజరాజేశ్వరీదేవి ఆలంకారం, 23న భవానీదేవి, 24న శారదాదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న శ్రీదేవి వనవిహారిణి, 27న ధనలక్ష్మిదేవి, 28న బాలత్రిపుర సుందరీదేవి, 29న సరస్వతీదేవి, 30న మహిషాసురమర్దిని, అక్టోబరు 1న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, అక్టోబరు 2న విజయలలితాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. తమిళనాడుకు చెందిన కళాకారులు అమ్మవారికి అలంకారాలు నిర్వహిస్తారని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

అమ్మవారిశాలలో వైభవంగా దసరా ఉత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టిరామమోహన్‌రావు తెలిపారు. శనివారం ఆలయంలో దసరా ఉత్సవాలపై ఉత్సవ కమిటీ సభ్యులు బుశెట్టి రాజశేఖర్, ఎస్వీ గోపాలకృష్ణలు వివరాలు వెల్లడించారు. 22న దసరా ఉత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. 29వ తేదీ బిందె సేవ, అక్టోబరు 2న విజయదశమిని పురష్కరించుకుని అమ్మవారి శమీ దర్శనం, తొట్టిమెరువణిలు, ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, వల్లెంకొండు ప్రతాప్, కోశాధికారి జ్వాలాది పరమేష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రావాలంటూ ఎమ్మెల్యేకు ఆహ్వానం

మైదుకూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) :మైదుకూరులో అత్యంత వైభవంగా జరుగనున్న దసరా ఉత్సవాలకు రావాలంటూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బల్లాని చెన్నకేశవ ప్రసాద్ ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే పుట్టా నివాసంలో మైదు కూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు పుట్టాను కలిసి దసరా ఆహ్వానించారు. జిల్లా ఆర్యవైశ్య వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ యెలిశెట్టి గురుప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య,జాయింట్ సెక్రటరీ వంకదారి రవి ప్రసాద్‌లు ఉన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న చైర్మన్ గురివిరెడ్డి

కాశినాయన సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి) మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రారంభించిన స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యాక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నర్సాపురం సహకార సంఘం చైర్మన్ బంగారు గురివిరెడ్డి మండల వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం కోడిగుడ్లపాడు గ్రామీణ ఆరోగ్య కేంద్ర ంలో స్థానిక సర్పంచ్ బాలగురయ్యతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్.శ్రీనివాసులరెడ్డి, రోహిత్‌రెడ్డి, బి.నరసింహారెడ్డి, గుర్విరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లి రైతులు చంద్రబాబుకు రుణపడి ఉన్నారు

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఉల్లి రైతులు సీఎం చంద్రబాబు నాయుడుకి రుణపడి ఉన్నారని మైదుకూరు మార్కెట్‌కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర తెలిపారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారంవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం చాలా సంతోషకరమన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిని కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని రవీంద్ర తెలిపారు.